
# అమెరి'కులాసా' కథలు

- వంగూరి చిట్టెన్‌రాజు





## -25-

## నా గోడ మీద మరొకరి పిడకలా? హన్నా!

**మా చిన్నప్పుడు** కాకినాట్లో మా పెద్ద స్థలంలో ఒక మూల మా తాత గారు కట్టించిన ఇల్లూ, దాన్ని ఆనుకుని మా బాబయ్య గారు..అంటే నాన్న గారు...మా ఇంట్లో మటుకు బాబయ్య గారు అని పిలిచే వాళ్ళం– కట్టించిన రేడియో హాలూ, సమ్మర్ హౌసూ..వీటన్నింటికీ దూరం గా మరొక మూల ఒక తాటాకుల పాక, అందులో నాలుగైదు గేదెలు, ఆవులూ ఉండేవి. ఆ పాక పక్కనే మా వీధి ప్రహారీ గోడ లో ఒక పెద్ద గేటు, దానికి బాగా ఇవతల చిన్న గేటు అంటే మా వీధి గుమ్మం ఉండేవి. ఆ గేదెలూ, ఆవులూ బయటకి వెళ్ళడానికీ, ఎప్పుడైనా మా పొలం నించి ధాన్యం బళ్ళు, గడ్డి బళ్ళు వచ్చినప్పుడు మా కాంపౌండ్ లోపలికి రావడానికీ ఆ పెద్ద గేటు వాడే వాళ్ళం. ఆ ఆవులూ, గేదెల సంరక్షణకి రోజుకి వాడికి పదో ఏటి నుంచీ రోజుకి 24 గంటలూ మా ఇంట్లోనే ఉంటున్న సూన్నారాయణదే బాధ్యత. రోజూ సమయానికి వాటికి తవుడు, ఉలవలు పెట్టడం, మా తోటలోంచి కోసిన పచ్చ గడ్డీ, పొలం నుంచి వచ్చిన ఎండు గడ్డీ పెట్టడం మొదలైనవి వాడి పనులు. రోజూ సాయంత్రం వాటిని మా ఉప్పుటేరు కి తీసుకెళ్ళి, బంక మట్టి, జనప నారలతో ఆ పశువులకి శుభ్రంగా స్నానం చేయించి తీసుకు రావడం కోసం ఓ కుర్రాడూ, పొద్దున్నా, సాయంత్రం వచ్చి పాలు పితికి ఇవ్వడానికి పెద్దులు అనే పాల వాడూ కూడా ఉండేవారు. ఈ పెద్దులు అసలు ఉద్యోగం మా ఇంటి పక్కనే ఉన్న పార్కులో మొక్కల సంరక్షణ.



ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఆ ఆవులూ, గేదెలూ వాటికి ఇష్టం వచ్చినప్పుడు ఎక్కడ పడితే అక్కడ, ఎంత పడితే అంత వేసే పేడని శ్రద్ధగా ఒక చోటకి చేర్చి, ఎండకి కాస్త తడి ఆరేదాకా సంరక్షించడమే సూన్నారాయణ చేసే వాడు. కానీ పిడకలు కొట్ట మంటే "అది ఆడోళ్ల డూటీ. మంది కాదు" అనే వాడు. అంచేత ఆ పిడకలు కొట్టే పని మా మరో పని మనిషి గంగమ్మ చేసేది. ఈ గంగమ్మ కూడా మా ఇంట్లో నాకు తెలిసీ ముప్పై ఏళ్ళకి పైగా పని చేసింది. అంచేత ఆ పిడకలు మా ప్రహారీ గోడకి కేవలం ఇంటి వేపు మాత్రమే, అదైనా ఆ పెద్ద గేటుకి అవతలి వేపు పాక వెనకాల ఎవరికీ కనపడని చోట మాత్రమే కొట్టాలి అని గంగమ్మ కి బాగా తెలుసు. అంత కంటే ఎక్కువ గా ఆ ప్రహారీ గోడ అన్నా, దానికి వేయించిన గోపీ చందనం రంగు అంటే మా బాబయ్య గారికి ఎంతో ఇష్టం అని కూడా తెలుసు. ఆ రంగు వేసే తతంగం నాకు కూడా బాగా

తెలుసు. దానికి రెండు బస్తాల సముద్రం నత్త గుల్లలు తెప్పించి, వాటిని ఒక పెద్ద డేగిసా లో వేడి నీళ్ళలో ఉడికించి, బాగా మెత్తగా జారుడుగా వచ్చాక గోపీ చందనం పొడి కలిపి రంగరించి అది మళ్ళీ గట్టి పడిపోక ముందే మా తాపీ మేస్త్రి చేత అంగుళం అంగుళం దగ్గరుండి ఆ రెండు వందల అడుగుల గోడకి ముందు వీధి వేపు, ఇంకా సున్నం మిగిలి పోతే లోపలి వేపు వేయించే వారు మా బాబయ్య గారు.

ఒకసారి ఏమయిందంటే..కొంప మునిగింది. ఆ రోజు గంగమ్మ పని లోకి రాలేదు. అలా సాధారణంగా ఏడాదికి ఒకటి రెండు సార్లు జరిగేది అంతే. అంత నిబద్ధత కలిగిన వాళ్ళు గంగమ్మా, సూన్నారాయణా ఇద్దరూనూ. అంచేత మరో పని మనిషిని పంపించింది గంగమ్మ. సూన్నారాయణ నువ్వులు గానుగ ఆడించడానికి వెళ్ళాడు. ఆ రోజే పిడకలు కొట్టే పని పడింది. ఆ కొత్త పని మనిషి తెలియక "పిడకలు ఎక్కడ కొట్టమంతారమ్మా" అని మా అమ్మని అడిగింది. ఏదో పనిలో ఉన్న మా అమ్మ విసుగ్గా "ఎక్కడేమిటే, దేభ్యం. నా మొహాన కొట్టు" అని విసుక్కుని "ఆ వీధి గోడ మీదే కొట్టి తగలడు" అంది మా అమ్మ. దాంతో ఆ కొత్త పని మనిషి తట్టలతో వెళ్లి గోపీ చందనం వేసిన, సొగసైన, మా ప్రహరీ గోడ వీధి వైపు, పెద్ద గేటుకి అటూ, ఇటూ ఒక యాభై అడుగుల పొడుగు పిడకలు కొట్టి పారేసింది. మా బాబయ్య గారు సాయంత్రం కోర్టు నుంచి వచ్చి, వీధి గుమ్మం దగ్గర రిక్షా దిగీ దిగ్గానే రోడ్డు వేపే ఉన్న మా గోడ మీద కొట్టిన పిడకలు చూసి ఇంచు మించు మూర్ఛ పోయారు. ఆ తరువాత ఏం జరిగిందో అనవసరం కానీ ఇప్పుడు నాకు ఇదంతా ఇంత వివరంగా ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే...మొన్నామధ్య ఎవరో నా గోడ మీద వాళ్ళ పిడకలు కొట్టారు. ఆ నాడు మా బాబయ్య గారు ఆ కొత్త పని మనిషిని ఇంచు మించు జైల్లో పెట్టించినంత పని చేశారు. నాక్కూడా అంత కోపమూ, అంత కంటే ఎక్కువగా భయం కూడా వేసింది.

అసలేం జరిగిందంటే మొన్నామధ్య నా ఫేస్ బుక్ గోడ మీద ఎవరో R x&0@(%!....లాంటి మిలటరీ కోడ్ లో ఒక పోస్ట్ పెట్టారు. నా గోడ మీద పిడకలు కొట్టుకోడానికి సకల హక్కులూ నావే అయినప్పుడు మరి అది నా గోడ మీద ఇంకెవరో పిడకలు కొట్టడమే కదా! పైగా అదెవరికీ అర్ధం కాని షేపులో ఉన్న పిడక్కొట్టుడు కూడానూ. అది నేను చూసే లోగానే ఒక పాతిక మంది "నీ కేమన్నా మతి పోయిందా?", డోస్ ఎక్కువయిందా?, ఏమైనా సీక్రెట్ కోడ్ పెట్టి మమ్మల్ని అదేమిటో కనుక్కోమని ఛాలెంజ్ విసురుతున్నావా?, పాపం వయసు మీద పడుతోంది మరి. ఏం చేస్తాం...ఇదేమన్నా నానీలు, హైకూలు లాగా సరి కొత్త సాహిత్య ప్రక్రియ కనిపెట్టారా?. ...ఇలా రకరకాల మెసేజ్ లు పెట్టారు. ఆ పోస్ట్ నిఝంగా నేనే పెట్టాను అనుకున్నారు చాలా మంది. అలా అనుకుని నన్ను స్నేహితుల లిస్టు లోంచి కొట్టేయ్యడమో, ఇంకా ముందుకు పోయి FB వారికి నా మీద పితూరీ చెయ్యడమో చేస్తారేమే అని నాకు భయం కూడా వేసింది. వెంటనే ఆ పోస్ట్ డిలీట్ చేసేశాను కానీ ఆ కొత్త పని మనిషి పేరు కూడా మా బాబయ్య గారికి తెలియనట్టే నా గోడ మీద ఈ పిడక కొట్టినది ఎవరో తెలిసే అవకాశం లేదు. అసలు అలాంటి అవకాశం ఉందో లేదో కూడా నాకు తెలియదు. ఆ తర్వాత ఇలా పరాయి వాళ్ళు మన గోడ మీదకి రాకుండా కంచె వేసి ఆపవచ్చును అని ఎవరో సలహా ఇవ్వగానే సెట్టింగులలోకి వెళ్లి ఆ పని చేశాను. చెప్పొద్దూ, ఆ సెట్టింగుల లోకి వెళ్ళడానికి నాకు ఎప్పుడూ భయమే. ఎందుకంటే అదొక పద్మ వ్యూహం, నేనొక అభిమన్యుడిని. లోపలికి వెళ్తే ఎక్కడ ఏ బొత్తాం నొక్కో, లేక ఒకానొక వెధవ చోట టిక్కు పెట్టేసో ఇరుకున పడిపోయి ఇహ బయటకి రాలేం. అందుకే కెమెరాల దగ్గర నించి, ఫోన్లు, టీవీలు..అసలు ఇలా సెట్టింగులు అనే పదార్ధం ఉన్న ఏ పదార్ధం జోలికీ నేను వెళ్ళను.

అన్నట్టు పిడకలు అంటే జ్ఞాపకం వచ్చింది. మా చిన్నప్పుడు పిడకలు రెండు రకములు. ఒకటేమో మామూలుగా అర చేతి సైజులో ఉండి, వంటకీ, డేగిసా లో నీళ్ళు కాచుకోడానికీ వాడుకునేవి. ఇవి కాక భోగి పిడకలు. ఇవి కేవలం ఆవు పేడతో మాత్రమే చిన్న సైజులో చేసేవి. మొన్న జరిగిన భోగి పండుగ సమయంలో ఈ భోగి పిడకలనే గొబ్బిళ్ళ లో వాడాలి. ఈ ఆధునిక తరంలో ఈ భోగి పిడకల దండలు ఇంటర్ నెట్ లో కొనుక్కోవచ్చుట. కావాలంటే ఇందుతో జత పరిచిన ఫోటో చూడండి. ఒక్కొక్క పిడక యాభై రూపాయలు ట. ఆర్గానిక్ ఆవు పిడక కావాలంటే మరో పాతిక ట. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే సదరు ఆవు ఆర్గానిక్ ఆవు అయితే తప్ప ఆ పిడక ఆర్గానిక్ అయ్యే

అవకాశం లేదు. అన్నట్టు చాలా మందికి తెలియదేమో కానీ భక్తులందరూ నుదిటి మీదా, ఒళ్లంతానూ రాసుకుని తరించే విభూతికి కూడా మూల పదార్థం గోమలమే. మరీ పవిత్రంగా ఉండాలంటే దర్భలు, ఇతర హోమం వస్తువుల భాస్మంతో చేసిన ఆర్గానిక్ విభూతి వాడాలి అని కొందరి నమ్మకం. మరి మార్కెట్ లో ఆర్గానిక్ విభూతి ఎక్కడైనా దొరుకుతుందేమో వెతకాలి. పవిత్ర భారత దేశానికి అమెరికా ఆవు పిడకల ఎగుమతి వ్యాపారాలు కూడా ట్రంప్ గారి హయాంలో తప్పకుండా మొదలు అవుతాయి. ఒక వేళ ట్రంప్ గారు మెక్సికో సరిహద్దులో నిజంగానే గోడ కడితే ఇక ఇవతలి వేపు గోపీ చందనం, అవతలి వేపు పిడకల మయం అవుతుందేమో?

ఇంతకీ నా అమెరికా గోడ మీద ఎవరో కొట్టిన ఇండియా పిడక ఆర్గానిక్ బాపతా లేక సకల కాలుష్యాల బాపతా? అది పవిత్ర ఆవు వారిదా లేక గేదెల బాపతా? అన్నట్టు అది అమెరికా ఫేస్ బుక్ బాపతు కదూ! అసలు ఆ ఫేస్ బుక్ గోడల మీద కొట్టేవి చాలా మటుకు సొంత పిడకలే కదా!

**COMMENTS**